# నిబంధనల మేరకు పని చేయాలి

- తనిఖీ టీం సభ్యులకు అవగాహన సమావేశం
- ప్రచారాలు, ర్యాలీలను వీడియో రికార్డు చేయాలి
- అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలి
- రిటర్నింగ్ అధికారి, గద్వాల ఆర్డీవో చంద్రకళ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో చంద్రకళ

అలంపూర్, అక్టోబర్ 25: ఎన్నికల విధుల్లో టీం సభ్యులు ఎన్నికల నిబంధనలకు లోబడి బాధ్యతాయుతంగా పని చేయాలని అలంపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గద్వాల ఆర్డీవో చంద్రకళ అన్నారు. గురువారం సాయంత్రం అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏఆర్వో మంజుల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీఎస్టీ టీం సభ్యులకు విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో ఏమైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని, తనిఖీల్లో డబ్బు, వస్తువులు, మద్యం వంటివి పట్టుబడినప్పుడు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పట్టుబడిన వస్తువులు,లేదా నగదు సంబంధిత అధికారులకు అప్పగించాలని చెప్పారు. అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మిగతా నియోజకవర్గాలతో పోలిస్తే మన నియోజకవర్గంలో పట్టుబడిన కేసుల నమోదులో వెనుకబడి ఉన్నామన్నారు. ప్రతి రోజూ ఆయాపార్టీల అనుమానితుల వ్యక్తులపై నిఘా పెంచాలన్నారు. ప్రచారాలు, ర్యాలీలు, డోర్ టు డోర్ క్యాన్వాస్ సమయాల్లో నిఘా పెట్టి వారి కదలికలను రికార్డు చేయాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు దానికి జీవంపోసేది వీడియోగ్రఫీ మాత్రమే, కాబట్టి జాగ్రత్తగా పరిశీలనలో ఉండాలన్నారు. ఈ సందర్భంగా టీంసభ్యులు మాట్లాడుతూ తమ సమస్యను ఆర్వోకు విన్నవించారు. టీం సభ్యులకు సరిపడా వాహనాలు లేవని, ఒక్కో వాహనంలో కెపాసిటీకి మించి ప్రయాణం చేయవలసి వస్తుందని, నేటి వరకు ఉద్యోగులకు ఎన్నికల ఐడీకార్డులు కూడా ఇవ్వలేదని చెప్పారు. తనిఖీ సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. స్పందించిన ఆర్వో చంద్రకళ ఈ విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో మంజుల, డీటీ వేణుగోపాల్‌రెడ్డి, ఆరు ఎస్ఎస్టీ టీం సభ్యులు, ఆరు ఎఫ్ఎస్టీ టీం సభ్యులు, ఒక వీఎస్టీ టీం సభ్యులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసానికి గురైన యువకుడు

వడ్డేపల్లి, అక్టోబర్ 25: బండి కంతు కట్టాలని గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఒత్తిడి తేవడంతో కొంకల గ్రామానికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్‌లో డబ్బులు పంపి మోసపోయాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కొంకలకు చెందిన నారాయణగౌడ్ శాంతినగర్‌లోని బైక్ షోరూంలో మూడేళ్ల కిందట కంతులపై ద్విచక్ర వాహనం కొనుగోలు చేశాడు. వాహనానికి సంబంధించిన కంతు రూ.2,600 కడితే బండి కాగితాలు ఇస్తామని, మహబూబ్‌నగర్ నుంచి కాల్ చేస్తున్నామంటూ సెల్ నంబర్ 77802 73083 నుంచి ఫోన్ చేశారు. ఫోన్ పే నంబర్ 97007 70567 నవీన్‌గౌడ్‌కు డబ్బులు పంపాలని చెప్పడంతో రూ.2,600 పంపాడు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో తాను మోసపోయానని గుర్తించాడు. వెంటనే శాంతినగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నరేశ్ తెలిపారు.

## నేడు విద్యాసంస్థలు పునఃప్రారంభం

అయిజ, అక్టోబర్ 25: దసరా, బతుకమ్మ సెలవుల అనంతరం గురువారం నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. పండులను పురస్కరించుకుని బడులకు ఈనెల 13 నుంచి 25 వరకు, కళాశాలలకు 19 నుంచి 25 వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. బుధవారం సెలవులు ముగియడంతో గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు తెరుచుకోనున్నాయి.

## ఆర్డీఎస్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటి మట్టం

అయిజ, అక్టోబర్ 25: కర్ణాటకలోని టీబీ డ్యాం నుంచి విడుదల చేస్తున్న నీరు ఆర్డీఎస్ ఆనకట్టకు చేరుతోంది. బుధవారం ఇన్‌ఫ్లో 429 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 362 క్యూసెక్కులు నమోదైనట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 265 క్యూసెక్కులు చేరుతుండగా, ప్రస్తుతం 6.5 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

***టీబీ డ్యాంలో 37.785నీటి నిల్వ..***

కర్ణాటకలోని టీబీ డ్యాంలో 37.785 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో నిల్ నమోదు కాగా, అవుట్‌ఫ్లో 9,775 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 37.785 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ట నీటి మట్టానికి, ప్రస్తుతం 1610.11 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘువేంద్ర తెలిపారు.

## నిమజ్జనానికి అమ్మవారి తరలింపు



శాంతినగర్‌లో ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్తున్న భక్తులు

వడ్డేపల్లి, అక్టోబర్ 25: మున్సిపాలిటీ కేంద్రం శాంతినగర్‌లోని సీతారామాలయంలో నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో తుంగభద్రానదికి నిమజ్జనానికి తరలించారు. భక్తులకు ప్రసాదం, మహిళలకు కుంకుమ, గాజులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డీలర్ శ్రీనివాసచౌదరి, కౌన్సిలర్ ధనలక్ష్మి, శివ, వెంకట నారాయణ, ముఖర్జీ, గోపాల్‌రావు, ప్రభాకర్, హనుమంతరావు పాల్గొన్నారు. అలాగే సోమవంశ సహస్రార్జున క్షత్రియఖత్రి సమాజ్ వారి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం





ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 25: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన ఎర్రవల్లి మండలం ఇటిక్యాల పీఎస్ పరిధిలోని బీచుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... వీపనగండ్ల మండలం తూంకుంటకు చెందిన స్వర్ణ(40)కు భర్త రవితో కొన్నిరోజులుగా కలహాలు తలెత్తాయి. ఈ క్రమంలోనే మనస్తాపం చెందింది. బుధవారం ఆత్మహత్య చేసుకొనేందుకు బీచుపల్లి వద్ద కృష్ణా నదిలో దూకింది. అక్కడే నది పరిసరప్రాంతంలో ఉన్న పలువురు గంగపుత్రులు ఆమెను రక్షించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, స్పృహ తప్పిన స్వర్ణను అంబులెన్స్‌లో గద్వాల దవాఖానకు తరలించారు. స్వర్ణకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు

అలంపూర్, అక్టోబర్ 25: అలంపూర్ పోలీస్ సర్కిల్ పరిధిలో జాతీయ రహదారిపై పుల్లూరు వద్ద, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అలంపూర్ మండలం తుంగభద్రనది వంతెన అలంపూరు–ర్యాలంపాడు వద్ద, 44 జాతీయ రహదారి ఎర్రవల్లి మండలం బీచుపల్లి వద్ద ఒకటి , ఎన్నికల నేపథ్యంలో మొత్తం మూడు సరిహద్దు తనిఖీ చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. తాజాగా గురువారం రోజు చెక్ పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు అలంపూర్ సీఐ రాజు తెలిపారు. గురువారం అలంపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. ప్రతి చెక్ పోస్టు వద్ద స్థానిక పోలీసులతో పాటు సెంట్రల్ ఫోర్స్ టీం విధులు నిర్వహిస్తారన్నారు.



అలంపూర్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ రాజు, ఎస్సై రమేశ్

## అంతర్‌జిల్లా చెక్‌పోస్టు కోసం స్థలపరిశీలన

**బీచుపల్లిలో వాహన తనిఖీలు చేపట్టిన ప్రత్యేక బలగాలు**

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 25: గద్వాల ఆర్డీవో చంద్రకళ, ఎర్రవల్లి ఎమ్మార్వో నందినితో కలిసి బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో అంతర్ జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు కోసం బీచుపల్లిలో జాతీయ రహదారి పక్కన స్థలపరిశీలన చేశారు. అనంతరం పోలీసు అధికారులకు అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాల్సిందిగా సూచనలు ఇచ్చారు. ఈ మేరకు ఇటిక్యాల పోలీసులు, అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాలు ఐటీబీపీ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో నందిని, పోలీసు సిబ్బంది ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## 54.5 లీటర్ల మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో ఎస్సై నరేశ్‌కుమార్

అయిజ, అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీల జోరు పెంచారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు రోడ్లను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. బుధవారం పట్టణంలోని కర్నూల్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.28,700 విలువ చేసే 54.5 లీటర్ల మద్యాన్ని చిన్నతాండ్రపాడుకు ఓ వ్యక్తి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. అనుమతి లేకుండా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ జయన్న తదితరులు ఉన్నారు.

## కల్లు దుకాణంపై దాడులు : మహిళ పై కేసు నమోదు

వడ్డేపల్లి, అక్టోబర్ 25: మండలంలోని జిల్లేడుదిన్నెలో అనుమతి లేకుండా కల్లు దుకాణం నిర్వహిస్తుండగా మహబూబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్‌రెడ్డి తమ సిబ్బందితో దాడులు చేశారు. 234 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకుని కల్లు విక్రయిస్తున్న మహిళ రేవతిపై కేసు నమోదు చేశామని అలంపూర్ సీఐ హన్మనాయక్ తెలిపారు.

## అయ్యప్పస్వామికి విశేష పూజలు

అయిజ, అక్టోబర్ 25: పట్టణంలోని గద్వాల రోడ్డులో కొలువుదీరిన అయ్యప్పస్వామికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయంలోని అయ్యప్పమూల విగ్రహానికి అర్చకులు అభిషేకం, అలంకరణ చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.